కల్యాణం.. కమనీయం

- వైభవంగా సీతారాముల కల్యాణం
- భారీగా పాల్గొన్న భక్తులు
- ఆలయాల వద్ద అన్నదానాలు

షాద్‌నగర్‌టౌన్ : శ్రీరాముడి శోభాయాత్ర

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 17 : సీతారాముల కల్యాణం సందర్భంగా నియోజకవర్గంలో బుధవారం పెద్ద ఎత్తున సీతారాముల ఊరేగింపు నిర్వహించారు. అనంతరం కనుల పండువగా కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. రాష్ట్ర రోడ్డు అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి తమ స్వగ్రామమైన తొర్రూరులో సీతారాముల కల్యాణంలో పాల్గొన్నారు. ఎలిమినేడు గ్రామంలో జరిగిన కల్యాణ మహోత్సవంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పాల్గొన్నారు. ఆదిబట్ల మున్సిపాలిటీలో జరిగిన వేడుకల్లో మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి పాల్గొన్నారు.

పట్టువస్త్రాలను సమర్పించిన ఎమ్మెల్యే

కొత్తూరు : సీతారాముల కల్యాణాన్ని కొత్తూరు మున్సిపాలిటీ, మండలంలో కనుల పండువగా నిర్వహించారు. కొత్తూరు మండలంలోని పెంజర్ల అనంతపద్మనాభ స్వామి ఆలయంలో నిర్వహించిన కల్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొన్నారు. కల్యాణం అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ మామిడి శ్యాంసుందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, మామిడి సిద్ధార్థరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఎస్‌బీపల్లిలో నిర్వహించిన కల్యాణంలో జడ్పీటీసీ శ్రీలత సత్యనారాయణ ఆధ్వర్యంలో కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు.

మొయినాబాద్ : సురంగల్ గ్రామంలో..

షాబాద్ : షాబాద్ మండలంలోని సీతారాంపూర్ గ్రామంలో సీతారాముల కల్యాణం అంగరంగా వైభవంగా నిర్వహించారు. బుధవారం శ్రీరామనవమి సందర్భంగా సీతారాంపూర్ సీతారామ చంద్రస్వామి దేవాలయం ఆవరణలో వేదపండితుల మంత్రోచ్చరణాల మధ్య సీతారాముల కల్యాణం జరిపించారు. కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, చేవెళ్ల మాజీ ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి, టీటీడీ బోర్డుమెంబర్ గడ్డం సీతారెడ్డి, జడ్పీటీసీ అవినాశ్‌రెడ్డి తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మండల వ్యాప్తంగా వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో సీతారాంపూర్ మాజీ సర్పంచ్ పాండురంగారెడ్డి, ఎంపీటీసీ కుమ్మరి చెన్నయ్య, దేవాదాయశాఖ ఈవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

చేవెళ్ల రూరల్ : గ్రామాల్లోని పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ముడిమ్యాల్ గ్రామంలోని కోదండరామాలయంలో ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో సీతారామచంద్ర స్వామివార్లకు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించి కల్యాణం జరిపించారు. పామెన గ్రామంలో సాయిబాబా ఆలయంలో సీతారాములకు మాజీ సర్పంచ్ దావల్‌గారి గోపాల్‌రెడ్డి దంపతులు కల్యాణం జరిపించారు. ఆలూర్, మల్కాపూర్ గ్రామల్లో ఎంపీటీసీ గోపులారం యాదమ్మపోచయ్య, బక్కారెడ్డి రవీందర్‌రెడ్డి సీతారాముల కల్యాణంలో పాల్గొన్నారు.

చేవెళ్లటౌన్ : చేవెళ్ల పట్టణంలోని హనుమాన్ దేవాలయంలో సీతారాముల కల్యాణం ఎంతో వైభవంగా నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలతో శోభాయాత్ర నిర్వహించారు.

షాద్‌నగర్‌రూరల్ : ఫరూఖ్‌నగర్ మండలంలో శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

షాద్‌నగర్‌టౌన్ : పట్టణంలోని గోదా సమేత లక్ష్మీవేంకటేశ్వర స్వామి దేవాలయంలో సీతారాముల కల్యాణమహోత్సవాన్ని ఆలయ నిర్వహకులు, భక్తులు ఘనంగా నిర్వహించారు. మహోత్సవంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమెల్యేలు వై. అంజయ్య యాదవ్, ప్రతాప్ రెడ్డి, బక్కని నర్సింహులు, మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, జడ్పీటీసీ వెంకట్రాంరెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నవీన్‌రెడ్డి హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే పట్టువస్త్రాలను సమర్పించారు. కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద శోభాయాత్రను ఎమ్మెల్యే ప్రారంభించారు.

పెద్దఅంబర్‌పేట హనుమాన్‌నగర్‌లో కల్యాణ మహోత్సవం

కడ్తాల్ : మైసిగండి గ్రామంలో కల్యాణోత్సవానికి ముందు రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయశాఖ వారు పంపించిన పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలకు మైసమ్మ ఆలయంలో ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, జడ్పీటీసీ దశరథ్‌నాయక్, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా, వైస్ ఎంపీపీ ఆనంద్, ఈవో స్నేహలత తదితరులు పాల్గొన్నారు.

ఆమనగల్లు : ఆమనగల్లు పట్టణంలోని అంగడి బజార్‌లోని హనుమాన్ ఆలయం, పట్టణ సమీపంలోని అంతిరింతుర గుట్టపై ఉన్న ఆంజనేయస్వామి ఆలయం, అయ్యసాగరం క్షేత్రంలోని శ్రీరామాలయం, పోలేపల్లి గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో అర్చకులు సీతారాముల కల్యాణోత్సవం వైభవంగా జరిపించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు, భోజన వితరణ చేశారు. కార్యక్రమాలలో జూనియర్ సివిల్ జడ్జి కాటం స్వరూప, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్ గుప్తా, మున్సిపల్ చైర్మన్ రాంపాల్ నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం :నోముల గ్రామంలో కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

యాచారం: నల్లవెల్లి గుట్టపై జరిగిన కల్యాణంలో..

షాద్‌నగర్‌టౌన్ : పట్టువస్త్రాలను సమర్పిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కడ్తాల్ : రావిచేడ్ గ్రామంలో కల్యాణోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

షాబాద్: కుమ్మరిగూడలో కల్యాణంలో పాల్గొన్న భక్తులు

చేవెళ్లరూరల్ : ముడిమ్యాల్ గ్రామంలోని కోదండరామాలయంలో..

మంచాల: చాంద్‌ఖాన్ గూడలో..

ఆమనగల్లు అంగన్‌బజార్ హనుమాన్ ఆలయంలో ..

తుర్కయాంజాల్ : కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

నగరాలకు దీటుగా మానసిక వైద్యసేవలు

- ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్. శ్రీనివాసు

ఐఎంఏ షాద్‌నగర్ అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్‌కు జ్ఞాపికను అందజేస్తున్న గాయత్రీ మెడికేర్ వైద్యులు

షాద్‌నగర్, ఏప్రిల్17:సరైన సమయంలోసరైన వైద్యం అందిస్తే మానసిక రుగ్మతలను దూరం చేయవచ్చని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ షాద్‌నగర్ అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. షాద్‌నగర్ పట్టణంలో నూతనంగా ఏర్పాటుచేసిన గాయత్రీ మెడికేర్ మానసిక ఆరోగ్య వైద్యశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆందోళన, డిప్రెషన్, మతిమరుపు, ఆల్కాహాల్, స్మోకింగ్‌లకు బానిసలు కావడం, స్కిజోఫ్రెనియా, ఉన్మాదం వంటి మానసిక రుగ్మతలతో బాధపడుతున్న వారికి గాయత్రీ దవాఖానలో సరైన వైద్యం అందుతుందని, ప్రముఖ వైద్యులు డాక్టర్ కె. చైతన్యలక్ష్మీరెడ్డి వైద్య సేవలు అందిస్తారని చెప్పారు. దవాఖాన వైద్యులు, సిబ్బంది డాక్టర్ శ్రీనివాస్‌ను సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కార్తీక్ చంద్ర, డాక్టర్ కృష్ణ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభాకర్‌రెడ్డికి సేవా పతకం

సేవా పతకం అందుకుంటున్న ప్రభాకర్‌రెడ్డి

పెద్దఅంబర్‌పేట, ఏప్రిల్ 17: మమత ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపకులు, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్ సంస్థల వైస్ చైర్మన్ యానాల ప్రభాకర్‌రెడ్డిని విశ్వగురు వరల్డ్ రికార్డ్స్‌వారు ఉత్తమ సేవా అవార్డుతో సత్కరించారు. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీసుధా, డైరెక్టరేట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్ మదన్ మోహన్ చేతుల మీదుగా విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ ఫౌండర్ సీఈవో సత్యవోలు రాంబాబు ఈ అవార్డును అందజేశారు. తన సేవలను గుర్తించి సేవా పతకం అందజేయడం సంతోషంగా ఉన్నదని ప్రభాకర్‌రెడ్డి హర్షం వ్యక్తంచేశారు.

బీజేవైఎం జిల్లా కార్యదర్శిగా వగ్గు ప్రభాకర్

ఆమనగల్లు, ఏప్రిల్ 17 : బీజేవైఎం జిల్లా కార్యదర్శిగా ఆమనగల్లు మండలంలోని పోలేపల్లి గ్రామానికి చెందిన వగ్గు ప్రభాకర్‌ను నియమించారు. సంఘం బలోపేతానికి కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

హెచ్ఎండీఏలో సమన్వయ లోపం

ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఎస్టేట్‌పై ఆధిపత్య ధోరణి

ఉన్నతాధికారుల అండదండలతో ఇష్టారాజ్యం

భూముల రక్షణ లక్ష్యాన్ని పక్కన పెట్టిన అధికారులు

సిటీబ్యూరో, ఏప్రిల్ 17 (నమస్తే తెలంగాణ): విలువైన భూములను కంటికి రెప్పలా కాపాడాల్సిన అధికారులే కత్తులు దూసుకుంటున్న పరిస్థితి. సమన్వయంతో కలిసి పనిచేయాల్సిన వారు.. ఒక విభాగం అధికారులు మరో విభాగం అధికారులపై ఆధిపత్య ధోరణితో వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అధికారుల అధిపత్యాన్ని తట్టుకోలేకపోతున్నానని, తనను వేరే విభాగానికి బదిలీ చేయాలంటే ఓ ఉద్యోగి ఎస్టేట్ విభాగం ఉన్నతాధికారికి విన్నవించుకునే దాకా వెళ్లింది. ఈ పరిస్థితి హైదరాబాద్ మహానగరాభివృద్ధిలో కీలకంగా ఉన్న హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ(హెచ్ఎండీఏ)లో నెలకొంది. నేను కమిషనర్ మనిషిని.. నేను చెప్పినట్లు వినాలి... వినకపోతే నీపై కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తా.. నిన్ను సస్పెండ్ చేయిస్తాను... ఇది ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలోని ఓ అధికారి... ఎస్టేట్ వింగ్‌లో పనిచేసే సైట్ ఆఫీసర్‌తో అన్న మాటలు. ఇలాంటి పనితీరు హెచ్ఎండీఏలో నేనెప్పుడు చూడలేదని, ఇటీవల కొత్తగా పోలీస్ శాఖ నుంచి డిప్యూటేషన్‌పై వచ్చిన అధికారులు ఉన్నతాధికారుల అండదండలతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అసలు లక్ష్యాన్ని పక్కన పెట్టి అధిపత్యం కోసం సహచర ఉద్యోగుల పై వ్యవహరిస్తున్న తీరుపై ఉద్యోగులు మండిపడుతున్నారు. హెచ్ఎండీఏలో శాశ్వత ఉద్యోగులుగా ఉన్న తమపై డిప్యూటేషన్‌పై వచ్చిన కొందరు అధికారులు తీరును భరించలేకపోతున్నామని వాపోతున్నారు.

హెచ్ఎండీఏ పరిధిలో సుమారు 8,347 ఎకరాలు

అన్యాక్రాంతమవుతున్న భూముల పరిరక్షణకు మెట్రోపాలిటన్ కమిషనర్ ప్రత్యేకంగా దృష్టి సారించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఉన్న భూములు అత్యంత విలువైనవి కావడంతో వాటిని కాపాడాల్సిన అవసరం ఉందని ఉన్నతాధికారులకు ఇటీవల హెచ్ఎండీఏపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ఈ మేరకు మెట్రోపాలిటన్ కమిషనర్ ఎస్టేట్ విభాగం ఉన్నతాధికారులతో సమావేశమై మొత్తం హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న భూముల లెక్కలను గుర్తించాలని ఆదేశించడంతో ఆ లెక్కలు తీశారు. దాని ప్రకారం సుమారు 8347 ఎకరాలు ఉన్నట్లు తేలింది. కొన్ని చోట్ల 200-300 గజాల నుంచి మొదలు కొని ఎకరాల్లో స్థలాలు ఉన్నాయి. ఇందుకోసం మొత్తం ఏడుగురికి సైట్ ఆఫీసర్లుగా నియమించి ప్రతి రోజు వారికి కేటాయించిన భూముల వద్దకు వెళ్లి తాజా పరిస్థితులను ఎప్పటికప్పుడు ఎస్టేట్ ఆఫీసర్‌కు సమాచారం ఇచ్చేలా వ్యవస్థను నడిపిస్తున్నారు. అదేవిధంగా ఎక్కడైనా భూముల కబ్జాకు ప్రయత్నాలు జరుగుతున్నప్పుడు హెచ్ఎండీఏ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలో ఓ ఉన్న పోలీసు బలగాలను తీసుకొని రక్షణ చర్యలు చేపట్టాల్సి ఉంది. అవసరమైతే కబ్జాదారులపై స్థానిక పోలీస్ స్టేషన్‌లలో కేసులు నమోదు చేస్తూ విలువైన స్థలాలను కాపాడాల్సి ఉంటుంది.

భూముల పరిరక్షణలో రెండు విభాగాలు కీలకమే...

హైదరాబాద్ మహానగరాభివృద్ధిలో కీలకంగా ఉన్న హెచ్ఎండీఏ భూముల పరిరక్షణలో రెండు విభాగాల అధికారుల మధ్య పోరు తారాస్థాయికి చేరింది. హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీకి నగరం నలు మూలల ఎంతో విలువైన భూములు వేల ఎకరాలు ఉన్నాయి. ప్రస్తుత అవసరాలే కాకుండా భవిష్యత్ అవసరాల కోసం రాష్ట్ర ప్రభుత్వం పలు చోట్ల భూములను హెచ్ఎండీఏకు అప్పగించింది. ముఖ్యంగా హెచ్ఎండీఏ పరిధిలో సుమారు 30-40 చోట్ల వేర్వేరు ప్రాంతాల్లో సుమారు 8347 ఎకరాల భూములు ఉన్నాయి. ఆయా భూములు అన్యాక్రాంతం కాకుండా ఇందుకోసం ప్రత్యేకంగా రెవెన్యూ విభాగంలో ఎస్టేట్ విభాగం ఉంది. అదేవిధంగా పోలీసు బలగాలతో కూడిన ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం సైతం ఉంది. హెచ్ఎండీఏ రెవెన్యూ విభాగంలో ఎస్టేట్ ఆఫీసర్(ఈఓ)గా డిప్యూటీ కలెక్టర్ హోదా కలిగిన అధికారి ఉన్నారు. ఆయన కింద అసిస్టెంట్ ఎస్టేట్ ఆఫీసర్లు(సైట్ ఆఫీసర్స్) ఏడుగురితో పాటు తహసీల్దార్లు, ఇతర అధికారులు ఉన్నారు. వీరితో సైట్ ఆఫీసర్లు కొందరు నిత్యం క్షేత్ర స్థాయిలో ఉంటూ హెచ్ఎండీఏ భూములు కబ్జాల బారిన పడకుండా పనిచేయాల్సి ఉంటుంది. అదేవిధంగా హెచ్ఎండీఏ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలో డీఎస్పీ స్థాయి అధికారి, ఆయన పరిధిలో ఒక సర్కిల్ ఇన్‌స్పెక్టర్, ఒక సబ్ ఇన్‌స్పెక్టర్,పదుల సంఖ్యలో కానిస్టేబుల్స్, హోంగార్డులు ఉంటారు. ఈ రెండు విభాగాలు ఉన్నతాధికారుల నుంచి మొదలు కొని కింది స్థాయి వరకు ఉన్న కలిసి సమన్వయంతో కలిసి విధులు నిర్వహించాల్సి ఉంటుంది. కానీ గతంలో ఎప్పుడూలేని విధంగా ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎస్టేట్ విభాగాల మధ్య పోరు తీవ్ర స్థాయికి చేరుకుంది. ఇప్పటికే హెచ్ఎండీఏ పరిధిలో పలు చోట్ల భూముల కబ్జాలు షరా మామూలే అన్నట్లుగా ఉన్నాయి. ముఖ్యంగా జవహర్‌నగర్‌లో వేలాది ఎకరాల్లో ఇప్పటికే వందలాది ఎకరాలు కబ్జాకు గురయినా అడ్డుకోలేకపోయారన్న ఆరోపణలు ఉన్నాయి.

డంపింగ్ యార్డులో బయో మైనింగ్ యంత్రం ఏర్పాటు

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్, ఏప్రిల్ 17 : షాద్‌నగర్ మున్సిపాలిటీ సోలీపూర్ గ్రామ పరిధిలోని చెత్త డంపింగ్ యార్డులో బయో మైనింగ్ యంత్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. బుధవారం షాద్‌నగర్ పట్టణంలోని తన కార్యాలయంలో ఏర్పా టు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రము ఖ రాంకీ సంస్థ సహకారంతో బయో మైనింగ్ యంత్రాన్ని ఏర్పాటు చేసి తడి, పొడి చెత్తను వేరు చేసే విధంగా మున్సిపాలిటీ సిబ్బంది చర్యలు తీసుకుంటుందని అన్నారు. రూ. 2.5 కోట్ల నిధులను వెచ్చించి యంత్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రోజుకు 50 టన్నుల చెత్తను శుభ్రం చేస్తుందని, ప్రస్తుతం షాద్‌నగర్ మున్సిపాలిటీలో 400 టన్నుల వరకు చెత్తను సేకరిస్తున్నారని వివరించారు. చెత్తను రీ సైక్లింగ్ చేయడం ద్వారా సేంద్రియ ఎరువు ఉత్పత్తి అవుతుందని, దీంతో కొంత ఆర్థిక వనరులు ఏర్పడుతాయని చెప్పారు. కొంత కాలం తరువాత చెత్త డంపిం గ్ యార్డు స్థల మార్పుపై నిర్ణయం తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కృష్ణవేణి పాల్గొన్నారు.

జూన్‌లో డబుల్ బెడ్రూంలు

షాద్‌నగర్ మున్సిపాలిటీలో పరిధిలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్లను జూన్‌లో లబ్ధిదారులకు అందజేస్తామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు.

మండల కేంద్రంలో ఈదమ్మతల్లి-మానుదాస్వామిల ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం వడ్డెరులు బోనాలను సమర్పించారు.

కడ్తాల్, ఏప్రిల్ 17

ఇంటినుంచి వెళ్లిన యవతి అదృశ్యం

మొయినాబాద్, ఏప్రిల్ 17 :ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ యువతి అదృశ్యమైంది. ఈ ఘటన మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం ఏపీకి చెందిన అతిపాటి ఆదిశేషయ్య బతుకుదెరువు కోసం మొయినాబాద్ మండలానికి వచ్చి చిన్నషాపూర్ గ్రామ గేట్ సమీపంలో ఉంటున్నాడు. పది రోజుల క్రితం తన అన్న కూతురు లావణ్య తన ఇంటికి వచ్చింది. బుధవారం ఉదయం 6.30 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. చుట్టు పక్కల ప్రాంతాల్లో ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రూ.70 లక్షల ఆభరణాలు మాయం

బంజారాహిల్స్, ఏప్రిల్ 17 : వేసిన తాళం వేసినట్లే ఉంది.. కానీ, అల్మారాలో దాచిన సొత్తు మాయమైంది. ఈ ఘటన జూబ్లీహిల్స్ పోలీసు స్టేషన్ పరిధిలో ఓ వ్యాపారి ఇంట్లో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. జూబ్లీహిల్స్‌లోని రోడ్ నం.62లో నివాసముండే డీపీఎస్ సోమరాజు వ్యాపారి. కుటుంబ సభ్యులతో కలిసి ఓ శుభకార్యానికి వెళ్లి వచ్చారు. ఆ సమయంలో పని వారు మాత్రమే ఇంట్లో ఉన్నారు. ఇదిలా ఉండగా.. ఇటీవల తన తల్లికి సంబంధించిన ఆల్మారా తెరిచి చూడగా.. సుమారు రూ. 70 లక్షల విలువజేసే బంగారు వజ్రాలతో కూడిన చంద్రహారం, గాజులు, బంగారు బిస్కెట్లు కనిపించలేదు. అల్మారాకు వేసిన తాళం వేసినట్లే ఉంది. అల్మారాలో రూ.40లక్షల విలువైన మరిన్ని ఆభరణాలను ముట్టుకోలేదు. తెలిసిన వారే ఈ దొంగతానికి పాల్పడి ఉంటారని భావించిన సోమరాజు.. తన ఇంట్లో పని చేస్తున్న వారిపై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

గాంధీ దవాఖానలో మాక్‌డ్రిల్

బన్సీలాల్‌పేట్, ఏప్రిల్ 17 : దవాఖానలలో వందలాది మంది రోగులు ఉంటారని, అనుకోని ప్రమాదం సంభవిస్తే బయటకు వెళ్లడానికి రెండు మార్గాలు తెరిచి ఉంచాలని అగ్నిమాపక శాఖ హైదరాబాద్ జిల్లా అధికారి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అవగాహన వారోత్సవాల్లో భాగంగా బుధవారం గాంధీ దవాఖాన ఆవరణలో మాక్‌డ్రిల్ నిర్వహించారు. భవనం పై అంతస్తులలో ప్రమాదంలో చిక్కిన వారిని కిందకు దించడం, గదులలో మంటలు, పొగ నిండితే ఎలా అప్రమత్తం కావాలి, మంటలను నీటి ద్వారా ఎన్ని రకాలుగా ఆర్పడానికి అవకాశాలు ఉన్నాయనే దానిని అగ్నిమాపక శాఖ సిబ్బంది చేసి చూపించారు. పొగ వల్ల ఊపిరి తీసుకోలేని వారిని ఎలా కాపాడాలని ఓ నర్సు చేత చేయించి వివరించారు. గాంధీ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం రాజారావు మాట్లాడుతూ నాలుగేండ్ల కాలంలో ఎలాంటి చిన్న అగ్నిప్రమాదం కూడా జరుగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. దవాఖానలో పనిచేస్తున్న సిబ్బందికి ప్రతి నెలా ఇలాంటి అవగాహన శిబిరం నిర్వహించాలని ఆయన కోరారు. దవాఖాన ఆవరణలో అగ్నిమాపక శాఖ ఔట్ పోస్ట్‌లో 24 గంటల పాటు సిబ్బంది అందుబాటులో ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో ముషీరాబాద్ ఫైర్ అధికారి వెంకటేశ్వర్లు, గాంధీ దవాఖాన ఔట్‌పోస్ట్ ఫైర్ అధికారి ఎండీ ముస్తఫా, స్నోర్‌కల్ ఫైర్ అధికారి ఎండీ షబ్బీర్ అలీ, గాంధీ దవాఖాన డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ వినయ్‌శేఖర్, ఆర్ఎంవో డాక్టర్ జయకృష్ణ, సెక్యూరిటీ అధికారి శివాజీ, పలువురు వైద్యులు, నర్సులు, సెక్యూరిటీ పాల్గొన్నారు.